## ఇటు బతుకు ఆరాటం.. అటు ట్రాఫిక్ జంఝాటం





రహదారులపై తోపుడు బండ్లు, ఆటోలు పార్క్ చేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో పలువురు వాహన చోదకులు వాహనాలు ఆపి పండ్లు, కూరగాయలు తదితరాలు కొంటున్నారు. దీంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ నుంచి కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1లో.. ఈ దృశ్యం కనిపించింది. అయితే ట్రాఫిక్‌లో చక్రబంధంలో చిక్కుకొని తోటి వాహనదారులు గమ్య స్థానాలకు చేరుకోవడంలో జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా వ్యాపారులకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా చొరవ చూపాలని వేడుకుంటున్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి)

# స్మార్ట్ డస్ట్‌బిన్లు

చెత్త సేకరణకు బల్దియా స్మార్ట్ డస్ట్‌బిన్‌లు వినియోగించబోతోంది. బిన్ నిండగానే అలారం మోగే టెక్నాలజీని వాడుతున్నారు. ఆపై లొకేషన్ ఏజెన్సీకి అప్‌డేట్ కానుంది. వెంటనే పారిశుద్ధ్య సిబ్బంది అప్రమత్తమై ఆయా ప్రాంతాలకు చేరుకొని చెత్తను తరలిస్తారు. ఇప్పటికే మలక్‌పేటలో అమలు చేస్తుండగా తాజాగా కూకట్‌పల్లిలో ఈ కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుడుతున్నారు

- కూకట్‌పల్లి జోన్‌కు 111 మంజూరు
- డబ్బా నిండగానే మోగనున్న అలారం
- ఏజెన్సీకి అప్‌డేట్ కానున్న లొకేషన్
- ప్రజలకు తప్పనున్న దుర్వాసన వెతలు
- కార్పొరేటర్ సూచనలు తీసుకోనున్న బల్దియా సిబ్బంది

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) కూకట్‌పల్లి జోన్ పరిధిలో ఐదు సర్కిల్స్ ఉన్నాయి. మూసాపేట్‌లో 13 ప్రదేశాల్లో 26, కూకట్‌పల్లిలో 14 ప్రదేశాల్లో 24, కుత్బుల్లాపూర్‌లో 5 ప్రదేశాల్లో 18, గాజులరామారంలో 13 ప్రదేశాల్లో 28, అల్వాల్‌లో 11 ప్రదేశాల్లో 15 చొప్పున డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇలా మొత్తం 56 ప్రదేశాల్లో 111 నయా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకునేందుకు జీహెచ్ఎంసీ బాస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

### కార్పొరేటర్ ఆమోదించాల్సిందే!

గత బీఆర్ఎస్.. భాగ్యనగరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంక్ కోసం కృషి చేసింది. అయితే జీవీపీ (గార్బేజ్ వనరబుల్ పాయింట్) ఉదయం 7 గంటలు, రాత్రి 10 గంటల తర్వాత తరలిస్తున్నారు. ఒక్కో కార్మికుడు మెయిన్ రోడ్డు అయితే 500 మీటర్లు, కాలనీ, బస్తీ వీధుల్లో అయితే 750 మీటర్ల చొప్పున ఊడ్చి చెత్తను ఒక చోటకు చేర్చాలి. కాని కార్మికుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. చనిపోయిన వారి స్థానంలో కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం, మానేసిన వారి స్థానాలు భర్తీ చేయకపోవడం, కొత్తగా వెలుస్తున్న కాలనీలకు అనుగుణంగా సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే కనిపిస్తోంది. గతంలో ఉన్న జీవీపీ పాయింట్లను తగ్గిస్తూ రాగా.. తాజాగా స్మార్ట్ డస్ట్‌బిన్‌లు ఏర్పాటు వెనక ఉన్న మతలబు ఏంటనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కూకట్‌పల్లి జోన్‌లో 22 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఈ ప్రజాప్రతినిధులు.. డస్ట్‌బిన్‌ల ఏర్పాటు గురించి సందేహాలు వ్యక్తం చేస్తారన్న భయం అధికారుల్లో నెలకొంది. బల్దియా బాస్ ఆదేశాల మేరకు బిన్‌లు ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేయకుండా జీహెచ్ఎంసీ కార్పొరేటర్ సూచనలు, సలహాలు తీసుకున్న తర్వాతే పెట్టాలనే ఆలోచనలో ఉన్నారు.



స్మార్ట్ డస్ట్‌బిన్‌లు

### కొనసాగుతున్న జరిమానాలు..

వ్యాపార, వాణిజ్య సముదాయాలతో పాటు పాన్ డబ్బాలు, టిఫిన్ సెంటర్లు, ఇతరత్రా బడ్డీ కొట్ల దగ్గర కూడా పొడి, తడి చెత్త కోసం డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఇందుకోసం బ్లూ కలర్, గ్రీన్ కలర్ 35 లీటర్ల సామర్థ్యం ఉన్న డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోకపోతే బల్దియా సిబ్బంది రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తున్నారు. రెండు, మూడు సార్లు తనిఖీకి వెళ్లిన సిబ్బందికి సరైన సమాధానం చెప్పని పరిస్థితిలో ఒక్కో డివిజన్‌లో 40-50 మందికి ఒక్కో డబ్బాకు రూ.500 చొప్పున జరిమానా విధించారు. ఇది నిరంతర ప్రక్రియ అని, ఏ ఒక్క కాగితం ముక్క కూడా రోడ్డు మీద పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయమని తెలిపారు. ఇది మంచి నిర్ణయమే దీన్ని దుకాణదారులు అర్థం చేసుకోవడం లేదంటున్నారు.

### బిన్ నిండగానే అలారం..

స్మార్ట్ డస్ట్‌బిన్‌లు చెత్తను తరలించే ఏజెన్సీకి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తుందట. బిన్ నిండగానే లొకేషన్‌తో కూడిన సమాచారం సదరు ఏజెన్సీకి అప్‌డేట్ చేయడంతో వెంటనే అక్కడకు వెళ్లి ఆ చెత్తను తరలించేందుకు ఈజీగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు జీవీపీ పాయింట్ల వద్ద ఉదయం 7 గంటల లోపు, రాత్రి 10 గంటలు దాటిన తర్వాతనే చెత్తను తీసుకెళ్తుండగా.. కొత్తగా వచ్చే స్మార్ట్ బిన్ నిండగానే నిమిషాల వ్యవధిలో వాహనం అక్కడకు చేరుకొని తరలించే ప్రక్రియ చేపడతారని చెబుతున్నారు. ఇప్పటికే రాంకీ సంస్థ గత ఏడాది ఒక్కో ఎస్ఎఫ్ఏకు 3-5 డస్ట్‌బిన్‌లను స్వీపింగ్ పాయింట్ల కోసం ఇచ్చింది. దానికి అదనంగా స్మార్ట్ బిన్‌లు తోడైతే బహిరంగ ప్రదేశాలతో పాటు కొత్తగా స్వీపింగ్ పాయింట్లకు కూడా కొన్ని బిన్స్ ఇచ్చే ఆలోచనలో ఉందట. ఏది ఏమైనా చెత్త నిండి పోయి కూడళ్లు, చౌరస్తాలు, మైదానాలు, పార్కు, ఆలయాలు, పాఠశాలలు పరిసర ప్రాంతాలు దుర్వాసన వెదజల్లకుండా కొత్తగా వచ్చే డస్ట్‌బిన్‌ల వల్ల పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

## ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింహయాదవ్


నర్సింహయాదవ్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి రమేష్

బాలానగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజిగిరి ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా కాస నర్సింహయాదవ్ నియమితులయ్యారు. ఆ మేరకు శనివారం జిల్లా అధ్యక్షుడు కూన భరత్‌గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం బాలానగర్ పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. నర్సింహయాదవ్‌ను బండి శాలువాతో సత్కరించారు. పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్మికులకు అండగా ఉండాలని సూచించారు. అనంతరం యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టిన పార్టీ అధిష్టానానికి జిల్లా అధ్యక్షుడు భరత్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుష్పమ్మ, నాయకులు లక్ష్మయ్య, సప్పిడి భాస్కర్, శివనారాయణ, ప్రకాశ్, హుస్సేన్, జమీర్, మోసిన్, మైసయ్య, నయీమ్, ఎజాజ్, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

### ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి : బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి


పండ్లు పంపిణీ చేస్తున్న మాధవరం కాంతారావు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అందరికీ విద్య, వైద్యం అందించాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందని కూకట్‌పల్లి స్వచ్ఛభారత్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. ఈ మేరకు తన జన్మదినం పురస్కరించుకొని బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌గౌడ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో శనివారం పండ్లు పంపిణీ చేశారు. పుట్టిన రోజు వేడుకలు రోగుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. వైద్యం కోసం ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదని, ఆమేరకు కేంద్ర ప్రభుత్వం ఉచిత వైద్యం అందించే దిశగా ప్రయత్నాలు చేస్తుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా పేదలకు తోచిన సహాయం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంతారావు కేక్ కట్ చేశారు. పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భగవంత్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రాము, వేణు, బాలనారాయణ, శేఖర్, సన్నీ, సూరిబాబు, గణేష్, లక్ష్మీ, లహరి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కృష్ణారావు దంపతులకు శుభాకాంక్షలు


కృష్ణారావు దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సతీష్ అరోరా, రాజేశ్వర్‌రావు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా శివాలయం, సీతారామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వాచనాలు తీసుకున్నారు. అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకోగా.. దంపతులకు బీఆర్ఎస్ కార్పొరేటర్‌లు, స్థానిక ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. ఆమేరకు పుష్పగుచ్చాలు, జ్ఞాపికలు అందజేశారు. సతీష్ అరోరా, రాజేశ్వర్‌రావు సత్యనారాయణరావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్, అంబటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

తెలంగాణ అభివృద్ధి చెందాలంటే అది బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆయన సమక్షంలో మూసాపేటకు చెందిన బీజేపీ నాయకుడు నారాయణస్వామి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గులాబీ కండువా కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్ బలోపేతం కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తుకారం, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణి సంగమంలో పుణ్యస్నానం

బాలానగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): యూపీ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి కుంభ్‌మేళా త్రివేణి సంగమంలో శనివారం ఉదయం కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి పుణ్యస్నానం చేశారు. తెలంగాణ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని పూజలు చేసినట్లు ఆయన తెలిపారు.


పుణ్యస్నానం చేస్తున్న యుగంధర్‌రెడ్డి

## కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.13, వంకాయ రూ.18, బెండకాయ రూ.45, పచ్చి మిర్చి రూ.23, బజ్జి మిర్చి రూ.18, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.40, క్యాబేజీ రూ.09, బీన్స్ రూ.35, క్యారెట్ రూ.18, గోబి పువ్వు రూ.18, దొండ కాయ రూ.40, చిక్కుడు కాయ రూ.40, గోరు చిక్కుడు రూ.40, బీట్‌రూట్ రూ.17, క్యాప్సికం రూ.35, ఆలుగడ్డ రూ.20, కీర రూ.18, దోసకాయ రూ.25, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, కంద రూ.60, ఉల్లిపొరక రూ.35, ఉల్లిగడ్డ రూ.35, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.08-09, చామగడ్డ రూ.45, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ.20, నిమ్మకాయలు రూ.40-50, మునగ కాయలు రూ.08-10, పచ్చిబఠాణి రూ.33, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.180, అల్లం రూ.80, వెల్లుల్లి రూ.160, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.75, కరివేపాకు రూ.100, పర్వల్ రూ.55, పల్లికాయ రూ.60, లోబా రూ.25, ఆ కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే సమస్య పరిష్కారం

- జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్
- ఫతేనగర్‌లో పర్యటన
- రోడ్డు విస్తరణ పట్లపై సమాలోచన


ఫతేనగర్‌లో జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్, ట్రాఫిక్ సీఐ సురేశ్

ఫతేనగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బాలానగర్ టీ జంక్షన్ నుంచి ఫతేనగర్ ఫ్లైఓవర్ వరకు నెలకొంటున్న ట్రాఫిక్ సమస్య తీరాలంటే రోడ్ల విస్తరణతోపాటు కరెంటు స్తంభాలను కూడా జరపాల్సి ఉంటుందని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్ తేల్చారు. దీంతో పాటు ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అందుకు అయ్యే ఖర్చు తదితర అంశాలపై అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని జెడ్సీ తెలిపారు. ఫతేనగర్ ప్రధాన రహదారిపై తలెత్తె ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. అధికారులు, బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేష్‌కుమార్‌తో కలిసి ఆయన ఫతేనగర్‌ను సందర్శించారు. ఫ్లై ఓవర్ నుంచి టీ జంక్షన్ వరకు నడుచుకుంటూ రోడ్డుకు రెండు వైపుల ఉన్న నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి సర్కిల్ డీఈ ఎలక్ట్రికల్ స్వప్న పాల్గొన్నారు.


ప్రజాభవన్‌లో సీఎం, మంత్రులతో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

### ముఖ్యనాయకుల సమావేశానికి కార్పొరేటర్..

హైదర్‌నగర్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో బీసీల సంక్షేమం కోసం చర్చించడానికి ప్రజాభవన్‌లో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## రేపు పీజేఆర్ నగర్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

హైదర్‌నగర్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్‌లో ఉన్న అక్షయ విద్య ఫౌండేషన్ భవనం ప్రారంభోత్సవానికి ఈనెల 24న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రానున్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న ఏర్పాట్లను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, యాదగిరి, ఫౌండేషన్ ఫౌండర్ వరప్రసాద్, యూబీడీ సూపర్‌వైజర్ నాగరాణి, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## రంజాన్ పండుగకు అన్ని ఏర్పాట్లు చేయాలి

### ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్‌బేగ్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగకు మసీదుల్లో, ముస్లింలు నివసిస్తున్న ప్రాంతాల్లో కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్‌బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అమ్జదుల్లా హుస్సేనీ అన్నారు. శనివారం అత్తాపూర్ బడా మజీదులో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం మతపెద్దలతో వారు సమావేశమయ్యారు. రంజాన్ సందర్భంగా ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.


ఫెలోషిప్ కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

## పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక

బాలానగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బాలానగర్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా విజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా గిరిబాబు, కోశాధికారిగా దినకర్‌లను ఎన్నుకున్నారు. అడ్వైజరీ కమిటీ సభ్యులుగా రత్నం, క్రిస్టోఫర్, స్టాన్లీ నియమితులయ్యారు. శనివారం బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో వీరంతా మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఆవుల సత్కరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు డానియర్, కే. రాజు, జయప్రసాద్, కిషోర్, సందీప్, ఎమాన్యువల్, రాజు, జయప్రసాద్ కిషోర్ పాల్గొన్నారు.

## పేదలకు అండగా బీఆర్ఎస్


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డుబోయినపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధికారంలో లేక పోయినప్పటికీ పేద ప్రజల పక్షాన నిత్యం పోరాడుతూనే ఉంటుందని ఓల్డుబోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శనివారం ఉదయం బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయన తన నివాసంలో 2025 క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, మైనారిటీ నాయకుడు మిరాజ్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు బుర్రి యాదగిరి, ఖదీర్ , సిరాజ్, నజీబ్ పాల్గొన్నారు.

## అన్ని బస్తీల్లో మౌలిక సదుపాయాలకు కృషి : ఎమ్మెల్యే

గోషామహల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని అన్ని బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ అన్నారు. శనివారం జాంబాగ్ డివిజన్‌లోని హిందీనగర్, టెంట్‌హౌజ్ లేన్ బస్తీలో రూ.35లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్‌తో ఆయన కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వి.గోపాల్‌జీ, రవీందర్‌సింగ్, శైలేందర్‌యాదవ్, వెంకటేశ్ యాదవ్, ఎం.కృష్ణ, గణేష్‌యాదవ్, ఆనంద్‌జైన్, మయూర్, రాకేశ్, అనిల్, రఘు, రాజ్‌కుమార్, రేణుక, రామకృష్ణ, నందుకుమార్, జగపతి పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి


సైన్స్ ఫెయిర్‌లో నమూనాను పరిశీలిస్తున్న ఎంఈఓ హరీష్‌చంద్ర

బాలానగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే భవిష్యత్‌లో వారికి తిరుగు ఉండదని మండల విద్యాధికారి(ఎంఈఓ) హరీష్‌చంద్ర అన్నారు. బాలానగర్‌కు చెందిన అక్జోనోబుల్, అప్ప ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బాలానగర్, ఆర్‌పీ కాలనీ, మడ్‌ఫోర్డ్ పాఠశాలల విద్యార్థులతో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన సైన్సు నమూనాలను పరిశీలించారు. సైన్స్ ఫెయిర్స్‌ను ఏర్పాటు చేస్తే ఆసబ్జెక్ట్ పట్ల విద్యార్థులకు మరింత ఇష్టం పెరుగుతుందన్నారు. మరిన్ని అద్భుతాలను సృష్టిస్తారన్నారు. అనంతరం జెడ్పీ స్కూల్ హెచ్ఎం అరుణ్‌జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు సైన్సు, సాంకేతిక రంగంలో రాణించాలని అప్ప స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అక్జోనోబుల్ ప్రతినిధులు సత్పతి, శ్రీవాత్సవ, గౌరిపాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నీ విజేత శాంతినగర్ బ్రాంచ్ జట్టు



శ్రీచైతన్య హైస్కూల్ స్థాయి ఇంటర్నల్ వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా కూకట్‌పల్లి శాంతినగర్ బ్రాంచ్ జట్టు నిలిచింది. మొత్తం 13 జట్లు పాల్గొన్నాయి. తనీష్ బెస్ట్ ప్లేయర్‌గా నిలిచాడు. విజేత జట్టును ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

-కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి).


బెస్ట్ ప్లేయర్ ట్రోఫీని అందుకున్న తనీష్



ప్రజాభవన్‌లో సీఎం, మంత్రులతో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

## ప్రజాభవన్‌లో కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశం

హైదర్‌నగర్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో బీసీల సంక్షేమం కోసం చర్చించడానికి ప్రజాభవన్‌లో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



అక్షయ విద్య ఫౌండేషన్ భవన ప్రారంభోత్సవ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

## రేపు ఆల్విన్‌కాలనీకి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

హైదర్‌నగర్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్‌కు ఈనెల 24వ తేదీన అక్షయ విద్య ఫౌండేషన్ భవనం ప్రారంభోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ వస్తున్న సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, యాదగిరి, ఫౌండేషన్ ఫౌండర్ వరప్రసాద్, యూబీడీ సూపర్‌వైజర్ నాగరాణి, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో కంటి స్ర్కీనింగ్ టెస్ట్ శిబిరాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

## 2వేల మంది విద్యార్థులకు కంటివైద్య సేవలు

### రాష్ట్ర విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

గచ్చిబౌలి, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రిలో జరుగుతున్న కంటి స్ర్కీనింగ్ టెస్ట్‌ను శనివారం రాష్ట్ర విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ పరిశీలించారు. వారం రోజులుగా రంగారెడ్డి జిల్లాలోని గురుకుల్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు అందజేశారు. నెలరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ పాఠశాలలకు సంబంధించిన సుమారు 2వేల మంది విద్యార్థులకు కంటివైద్య సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అందులో భాగంగానే కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో నిర్వహిస్తున్నామన్నారు. మార్చి 3 వరకు ఈ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డులను పరిశీలిస్తూ, రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనురాగిణిరెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటేశ్వరరావు, జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఆస్పత్రి వైద్యులు కృష్ణ పాల్గొన్నారు.




డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సూపరింటెండెంట్ అనురాగిణిరెడ్డి

## ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించాలి

### రంగారెడ్డి జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటేశ్వరరావు

గచ్చిబౌలి, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించినప్పుడే ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ఆకర్షితులవుతారని రంగారెడ్డి జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రిలో 2024లో మెరుగైన వైద్యం అందించిన సిబ్బందిని గుర్తించి ప్రశంసా పత్రాలు అందజేశారు. వనస్థలిపురం, కొండాపూర్, ఆమన్‌గల్, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, హయత్‌నగర్ ఆస్పత్రుల్లో సిబ్బందికి పత్రాలు అందజేశారు. రోగులకు మంచి సలహాలు, వైద్యం అందించినప్పుడే ఆస్పత్రుల పట్ల ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనురాగిణిరెడ్డి, జిల్లాకోఆర్డినేటర్ చంద్రశేఖర్‌తో పాటు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్మార్ట్‌ఫోన్ యాప్‌ను ప్రారంభిస్తున్న జనసేన నాయకులు

## స్మార్ట్‌ఫోన్‌తో సమస్య పరిష్కారం: మాధవరెడ్డి

చందానగర్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): తమ చేతిలోని సెల్‌ఫోన్ సహాయంతోనే ప్రజలు సమస్యలపై తమకు ఫిర్యాదు చేయవచ్చని శేరిలింగంపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ మాధవరెడ్డి అన్నారు. సెల్‌ఫోన్ ద్వారా ప్రజా సమస్యల సేకరణ కోసం శనివారం ప్రత్యేక యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటి పరిష్కారం కోసం ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ వివిధ డివిజన్ల నాయకులు ఉన్నారు.

# చెరువుల్లో గుర్రపు డెక్క..

# కాలనీల్లో దోమల మోత..!

- మురికి కూపాలుగా మారిన చాకలి చెరువు, గోపిచెరువు
- కంటిమీద కునుకు కరువైన పరిసర ప్రాంతాల కాలనీవాసులు

చందానగర్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): చెరువుల్లో పెరుగుతున్న గుర్రపు డెక్కతో కాలనీల్లో దోమల మోత.. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కొన్ని చెరువుల్లో గుర్రపు డెక్క రోజురోజుకు పెరుగుతోంది. దీంతో అదే రీతిలో దోమలు కూడా పెరుగుతుండడంతో ప్రజారోగ్యం దెబ్బతింటుంది. దోమల నివారణ జరగాలంటే ముందు చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలి. ముఖ్యంగా శేరిలింగంపల్లి డివిజన్‌లోని గోపిచెరువు, పాపిరెడ్డికాలనీ చాకలిచెరువులో గుర్రపుడెక్క రోజురోజుకు పెరుగుతుంది. ముఖ్యంగా ఈ చెరువులోకి మురుగునీరు చేరడం, వ్యర్థపదార్థాలను కూడా పడవేయడంతో ఇవి మురికికూపాలుగా మారాయి. దీంతో ఈ చెరువులు ఈగలకు, దోమలకు నిలయాలుగా మారాయి. ఒకప్పుడు తాగుకు, సాగుకు ఉపయోగపడే ఈ చెరువుల్లోని నీరు నేడు మురికి కూపాలుగా మారాయి. దీంతో పరిసర ప్రాంతాల కాలనీవాసులకు కంటిమీద కునుకే కరువైంది.

### ఫాగింగ్ మరిచారు..

కాలనీల్లో, బస్తీల్లో రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్న దోమల బెడద నివారణ కోసం ఎంటమాలజీ విభాగం రోజువారీగా ఫాగింగ్ చేయడం పట్టించుకోకుండా మొద్దు నిద్రలోనే ఉంది. నాలాలు, చెరువుల పరిసర ప్రాంత కాలనీవాసులకు ఇబ్బందిగా మారింది. దోమ సంబంధిత వ్యాధి భారిన పడి ఆరోగ్యం దెబ్బతింటోందని పలువురు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం అయిందంటే చాలు.. దోమలు స్వైరవిహారం చేసుకుంటూ ఇళ్లలోకి చేరుతున్నాయని, ఎన్ని నివారణ చర్యలు తీసుకున్నా ఫలితం ఉండడంలేదని స్థానికులు అంటున్నారు.





చాకలి చెరువు, గోపిచెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క

### గుర్రపు డెక్కను తొలగించాలి



దోమల సంఖ్య పెరగడానికి చెరువుల్లో కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన గుర్రపు డెక్కనే ప్రధాన కారణం. ముందు గుర్రపు డెక్కను తొలగించాలి. ప్రతీరోజు ఫాగింగ్ చేస్తే దోమల నివారణ కొంత వరకు తగ్గుతుంది. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

\- రామస్వామి యాదవ్, గోపినగర్

### తొలగించేందుకు కృషిచేస్తా

చాకలి చెరువు, గోపిచెరువుల్లో గుర్రపుడెక్క విపరీతంగా పెరిగింది. ఒకసారి తొలగించాం. అయినా మళ్లీ మళ్లీ వస్తుంది. దీనిని తొలగించాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. అనుమతి వచ్చిన వెంటనే తొలగిస్తాం.

\- విజయ్ రాంమోహన్, శేరిలింగంపల్లి జోనల్ ఇన్‌చార్జి, ఎంటమాలజిస్ట్

# గచ్చిబౌలి డివిజన్‌ను అభివృద్ధి చేస్తాం

### ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్‌ను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శనివారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీనగర్, గుల్‌మొహర్ పార్కు, గోపన్‌పల్లి కాలనీలో రూ. 83.80 లక్షలతో సీసీరోడ్లు వేసేందుకు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డివిజన్‌లోని ప్రజలకు అన్నిరకాల మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. డ్రైనేజీ లైన్లు, సీసీ రోడ్లు, వీధి దీపాలు వంటి వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం కాలనీ వాసులు కార్పొరేటర్, ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



నేతాజీనగర్‌లో సీసీరోడ్ల పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

### శేరిలింగంపల్లిని తీర్చిదిద్దుతా

మియాపూర్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంను ఆదర్శనియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్‌లోని గోకుల్‌ప్లాట్‌లో సుమారు రూ.48.50 అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... ట్రాఫిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ముఖ్యంగా మాదాపూర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి తోడ్పడండి: ఉప కమిషనర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి

చందానగర్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్స్‌లను ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ పి.మోహన్‌రెడ్డి అన్నారు. సర్కిల్ కార్యాలయంలో వ్యాపార లైసెన్స్‌పై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వ్యాపారులు ప్రొవిజనల్ ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్ చెల్లింపు ద్వారా పొందవచ్చన్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా రెన్యువల్ చేసుకోవాలని ఆయన సూచించారు. లేకుంటే వారు జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. రహదారి, కొలతల ఆధారంగా ఫీజులు నిర్ణయిస్తారని తెలిపారు. ఆహార కల్తీ నివారణ కోసం హోటళ్లపై తనిఖీలు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఏఎంహెచ్ఓ రవి, అసిస్టెంట్ లైసెన్స్ అధికారి నరేందర్, కృష్ణ ఉన్నారు.

### ఎన్నో సమస్యలకు 'ప్రాపర్టీ షో పరిష్కారం'

ఆస్తిపన్ను సమస్యలు, పునర్ సమీక్ష అభ్యర్థనలు, ఆస్తిపన్ను అంచనాల్లో సవరణలు, అసైన్ బకాయిలు తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రాపర్టీషో పరిష్కార వేదికలు ఎంతో ఉపయోగపడుతాయని చందానగర్ సర్కిల్-21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి అన్నారు. చందానగర్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ప్రాపర్టీషో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్తిపన్నుకు సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారం, ఐజీఆర్ఎస్, స్వయం మూల్యాంకణం, పన్ను సర్దుబాటు, సవరణలు, బిల్లు కలెక్టర్ల ద్వారా చెల్లింపు నమూనా తదితర సమస్యలను తొలగించుకునేందుకు ఇది చక్కటి అవకాశం దీనిని ప్రజలు ఉపయోగించుకుని లబ్ధిపొందాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మార్చి నెలలో 1,8,15,22,29 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పైపు నుంచి గ్యాస్ లీకవుతున్న దృశ్యం

## పైపులైను నుంచి గ్యాస్ లీక్

- భయాందోళనలో స్థానికులు



మరమ్మతులు చేస్తున్న గ్యాస్ సిబ్బంది

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి ఎదురుగా ఉన్న యాజీడీ గ్యాస్ పైపులైను నుంచి శనివారం ఉదయం గ్యాస్ లీకవడంతో గుర్తించిన స్థానికులు భయాందోళనకు గురై సూరారం పోలీసులకు తెలియజేశారు. వారు విషయాన్ని గ్యాస్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌కు సమాచారమివ్వగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లీకేజీకి గల కారణం, దీని ప్రభావాన్ని పరిశీలించారు. సమస్య చిన్నదే కావడంతో తక్షణమే మరమ్మతులు చేయించారు. ప్రజలు భయాందోళనకు గురికావద్దని ప్రకటించారు. స్థానికంగా గ్యాస్ లీకేజీ వార్త దావాలనంగా వ్యాపించడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

## మైనర్లకు సిగరెట్లు అమ్ముతున్న వ్యాపారులపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మైనర్లకు సిగరెట్లు అమ్ముతున్న ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదైంది. వెంకటగిరిలో కిరాణాషాపులు, పాన్ షాపుల్లో మైనర్లకు సిగరెట్లు అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో జూబ్లీహిల్స్ ఎస్ఐ రమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. గంధం పరిమళ అనే కిరాణా షాపు నిర్వాహకురాలు మైనర్లకు సిగరెట్లు అమ్మినట్టు తేలడంతో కేసు నమోదు చేసి ఆరు వేల రూపాయల విలువ చేసే 88 సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కె.వెంకటేశ్వరరావు అనే కిరాణాషాపు యజమాని ఓ విద్యార్థికి సిగరెట్లు అమ్ముతుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి మూడు వేల రూపాయల విలువ చేసే సిగరెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

## రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వివిధ రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లో మెక్ డోనాల్డ్, రాఘవేంద్ర ఉడిపి, ఖైరతాబాద్ క్షత్రియ టిఫిన్స్, మాదాపూర్‌లో బేక్‌బాక్స్, టాన్ కాఫీలో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న వ్యాపారులకు నోటీసులు అందజేశారు.

## పని చేయించుకుని జీతాలివ్వలేదని ఆందోళన

బోరబండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో పని చేయించుకుని మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఫై ఫ్రూట్ బాక్స్ సంస్థలో పనిచేసిన 185 మంది మహిళలు శుక్రవారం అర్థరాత్రి బోరబండ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. కార్మికనగర్‌కు చెందిన నీలంటి సంతోష్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫై ఫ్రూట్ బాక్స్ పేరుతో ఆరు నెలలుగా ఆన్‌లైన్ వ్యాపారం చేస్తున్నాడు. సంస్థలో 120 మంది డెలివరీ బాయ్స్, 65 మంది ప్యాకింగ్, కటింగ్ కోసం పనిచేస్తున్నారు. సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి గత మూడు నెలలుగా జీతం ఇవ్వడం లేదు. సుమారు రూ.25 లక్షలకు పైగా జీతాలు రావాలని బాధితులు చెబుతున్నారు. సంస్థ యజమాని కనిపించకుండా తిరుగుతుండటంతో అతని తల్లి దండ్రులను తీసుకొచ్చి బోరబండ పోలీసులకు అప్పగించారు. అయితే ఈ సమయంలో సంస్థ యజమాని సంతోష్ ప్రేమ వివాహం చేసుకుని స్టేషన్‌కు రావడంతో అందరూ ఆశ్చర్యపోయారు. సంతోష్ బాధితులతో మాట్లాడేలా పోలీసులు చొరవ తీసుకోవడంతో వారు శాంతించారు.

## ప్రమాదకరంగా వెళ్తున్న వాహనం.. డ్రైవర్‌పై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇనుప కడ్డీలతో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహన డ్రైవర్‌పై కేసు నమోదైంది. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ గోవర్థన్‌రెడ్డి బీఆర్ఎస్ భవన్ వద్ద విధులు నిర్వహిస్తుండగా ఓ డీసీఎం ప్రమాదకరంగా ఇనుప కడ్డీలను వేసుకొని వెళ్తుంది. డ్రైవర్‌ను హెచ్చరించినా పట్టించుకోలేదు. దీంతో వాహనాన్ని ఆపి డ్రైవర్ ముజాఫర్‌ను బంజారాహిల్స్ శాంతిభద్రతల విభాగం పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## ప్రేమలో విఫలమై యువకుడి ఆత్మహత్య

హైదర్‌నగర్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతికి పెళ్లి సంబంధాలు చూస్తుండటంతో మనస్థాపం చెందిన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా సునకేసుల కొత్తకోటకు చెందిన బీరప్ప కుమారుడు మల్లికార్జున (26) కర్నూల్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. అక్కడే స్థానికంగా ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. యువతి తల్లిదండ్రులు వీరి ప్రేమను ఒప్పుకోక పోగా ఆ యువతికి పెళ్లి చేసేందుకు సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. దీంతో మనస్థాపం చెందిన మల్లికార్జున్ నాలుగు రోజుల క్రితం తల్లిదండ్రులకు చెప్పకుండా హైదరాబాద్‌కు వచ్చాడు. ఉద్యోగం నిమిత్తం ఎక్కడికైనా వెళ్లాడేమోనని తల్లిదండ్రులు అనుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం ప్రగతినగర్ రోడ్డులోని అంబీర్‌చెరువు కట్టపైన ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఉన్న మల్లికార్జున మృతదేహాన్ని చూసిన స్థానికులు కేపీహెచ్‌బీ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడ లభించిన సెల్‌ఫోన్, పర్స్ ఆధారంగా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## విదేశీ యాత్ర పేరుతో మోసం.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విదేశీ యాత్ర పేరిట డబ్బు వసూలు చేసి మోసం చేసిన ట్రావెల్ ఏజెంట్‌పై కేసు నమోదైంది. కాప్రాకు చెందిన ఎ.విష్ణువర్థన్ ప్రభుత్వ ఐబీసీటీలో ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. 2019లో స్నేహితుడి ద్వారా బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో ఉన్న ఐడియా మంత్ర ట్రావెల్స్ సంస్థ యూరప్ టూర్ నిర్వహిస్తుందని తెలుసుకుని నిర్వాహకుడు శివప్రసాద్‌రెడ్డిని కలిశాడు. స్నేహితుడు కె.వెంకటనారాయణతో కలిసి వెళ్లేందుకు నిర్ణయించుకుని రూ.1.20 లక్షలు చెల్లించారు. అయితే శివప్రసాద్‌రెడ్డి కరోనా పేరు చెప్పి టూర్ వాయిదా వేసుకుంటూ వచ్చాడు. 2021లో యూరప్ బదులు దుబాయ్ టూర్‌కు వెళ్లాలని చెప్పాడు. దీనికి వారు ఒప్పుకున్నారు. అయితే అక్కడికీ తీసుకెళ్లకుండా, డబ్బు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టాడు. దీంతో కొద్ది రోజుల క్రితం ఐడియా మంత్ర కార్యాలయానికి వచ్చి చూడగా అది అక్కడ లేదు. మోసపోయినట్టు గ్రహించిన విష్ణువర్థన్ బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చంద్రబాబుపై విమర్శలు చేస్తే సహించం : పాతూరి

హైదర్‌నగర్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీమీద చంద్రబాబునాయుడు మీద అతి ప్రేలాపనలు పేలుతున్న బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా విమర్శలు మానుకోవాలని టీడీపీ మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి పాతూరి వెంకట్రావు అన్నారు. చంద్రబాబు జోలికి వస్తే సహించేది లేదని, మీ పదేళ్ల అధికారంలో ఐదేళ్లు మీ ఆప్తమిత్రుడు జగన్మోహన్‌రెడ్డిని పక్కన పెట్టుకొని చేపల పులుసు, నాటుకోడి పులుసులతో బంధం కొనసాగించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల సమస్యలను పట్టించుకోకుండా మీ కుటుంబ సభ్యుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టి చేసిన పనులకి ప్రజలు ఓడించి ఇంటికి పంపించినా.. మీకు సిగ్గు రాలేదని మండిపడ్డారు. మీలాంటి వాళ్లకు మళ్లీపట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా లేరని పాతూరి విమర్శించారు.



స్టేడియాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## ఇండోర్ స్టేడియాన్ని సందర్శించిన అధికారులు

**జీడిమెట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):** కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో కోటి రూపాయలతో నిర్మించిన ఇండోర్ స్టేడియంను శనివారం జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ స్పోర్ట్స్ యాదగిరిరావు, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌లు సందర్శించి పరిశీలించారు. ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తూనే, లీజుకు ఇచ్చే విధానాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా అపురూపా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వల్లభనేని రమణ, ఎస్ఆర్ నాయక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు టీటీకే శ్రీనివాస్‌లు స్టేడియం నిర్మాణంలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని, నాణ్యత పాటించలేదని అన్నారు. స్టేడియం స్థలాన్ని కబ్జాచేసినా కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు పట్టించుకోవడం లేదని, టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పెడచెవిన పెట్టడంతో స్థలంలో కబ్జాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈ గణేష్, గాజులరామారం ఈఈ కిష్టప్ప పాల్గొన్నారు.

## మరమ్మతు చేశారు.. క్యూరింగ్ మరిచారు



క్యూరింగ్ చేయని మ్యాన్‌హోల్

**పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) :** రామచంద్రకాలనీలో మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేసిన కాంట్రాక్టర్ క్యూరింగ్ చేయడం మరిచాడు. దీంతో మ్యాన్‌హోల్‌కు పగుళ్లు వచ్చాయి. దీనిపైనుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తే సమస్య మొదటికి వస్తుంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కాంట్రాక్టర్ ఇష్టారీతిన పనులు చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి, మ్యాన్‌హోల్‌కు కాంట్రాక్టర్‌తో క్యూరింగ్ చేయించాలని కోరుతున్నారు.

## తాగునీటి లీకేజీలను అరికట్టాలి



వాల్వ్ నుంచి లీకేజీ అవుతున్న తాగునీరు

**పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):** జీడిమెట్ల డివిజన్‌లోని సుచిత్రా నుంచి కుత్బుల్లాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇండియన్ పెట్రోల్‌బంక్ సమీపంలో వాల్వ్ నుంచి నీరు లీకేజీ అవుతూ రహదారిపై పారుతోంది. ఈ వాల్వ్‌కు ఆరు నెలల్లో 5 సార్లు మరమ్మతులు చేసినా లీకేజీ అవుతూనే ఉంది. గుత్తేదారు పనులను సక్రమంగా చేయకపోవడం వల్లే ఇలా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతి నీటి బొట్టును ఆదా చేయాలని చెబుతున్న అధికారులకు వాల్వ్ నుంచి ధారలా నీరు పోతుంటేతే వారికి కనిపించడం లేదా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాల్‌లో నుంచి నీరు లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

## వ్యర్థాలను తొలగించాలి



తొలగించని మట్టి, రాళ్లు

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) :** కుత్బుల్లాపూర్ డివిజన్ బాల్‌రెడ్డినగర్ గాంధీ విగ్రహం సమీపంలో తాగునీటి లీకేజీలకు నెలరోజుల క్రితం అధికారులు మరమ్మతులు చేశారు. సిమెంట్ చేసి, పాడవకుండా చుట్టూరా మట్టి, రాళ్లను ఏర్పాటు చేశారు. అయితే సదరు వ్యర్థాలను తొలగించకపోవడంతో రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు తెలుపుతున్నారు. అధికారులు లేదా సంక్షేమ సంఘాల ప్రతినిధులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.



మ్యాన్‌హోల్ నుంచి ఓవర్‌ఫ్లో అవుతున్న మురుగునీరు

## మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలి

**షాపూర్‌నగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):** గాజులరామారం సర్కిల్ పరిధిలోని హెచ్ఏఎల్‌కాలనీ తొమ్మిదవ రోడ్డు ఆదర్శనగర్‌కు వెళ్లే ప్రధాన సిటీప్లేస్ ఫంక్షన్‌హాల్ ముందు రహదారికి పక్కనే మ్యాన్‌హోల్ లీకేజీతో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతుంది. విపరీతమైన దుర్గంధం వెదజల్లడంతో ఈ దారిన వెళ్లే ప్రజలు, వాహనదారులు ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



సేవాలాల్ మహారాజ్‌కు నివాళులర్పిస్తున్న బంజారా సేవా సంఘం సభ్యులు

## సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

**నిజాంపేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) :** నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ ప్రాంతంలో సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలను బంజారా సేవాసంఘం సభ్యులు శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి, మాజీ ఎంపీ రవీందర్‌నాయక్, నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీమంత్రి అమర్‌సింగ్ తిలావత్, ఆల్‌ఇండియా బంజారా సేవాసంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూగజీవులను చంపవద్దు, మత్తుపానీయాలను మరిచిపోవాలని, ప్రజలపై జరుగుతున్న అరాచకాలను ఎదురిస్తూ, బంజారా జాతిని చైతన్యం పరిచిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతినగర్ మాజీ ఉపసర్పంచ్ సి.ఉదీర్‌రెడ్డి, బంజార నాయకులు రాంబాబ్‌నాయక్, రవినాయక్, కొర్రి రాములు నాయక్, రామచందర్ నాయక్, హరియానాయక్, అశోక్, గుడిపూజారి ఎస్సీనాయక్, మహరాజా సేవాసంఘం సభ్యులు, బంజారా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసుల స్పెషల్ డ్రైవ్



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):** విజిబుల్ పోలీస్‌లో భాగంగా పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాలనీలు, పాన్‌షాపులు, దుకాణాలు, బహిరంగ ప్రదేశాల్లో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాత్రివేళ జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, మత్తు పదార్థాలు మొదలైన వాటిపై తనిఖీలు నిర్వహించారు. మేడ్చల్ ఎస్ఓటీ, క్రైం, పేట్‌బషీరాబాద్ పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది విస్తృతంగా పెద్దఎత్తున తనిఖీలు చేసి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 10 మందిని, గంజాయి సేవిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో పేట్‌బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్, ఎస్ఐలు మహేశ్వర రెడ్డి, లావణ్యగౌడ్, సురేందర్‌రెడ్డి, నర్సింహ, సిబ్బంది పాల్గొన్నారు.

### జగద్గిరిగుట్ట పరిధిలో

**జీడిమెట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జగద్గిరిగుట్టలో శుక్రవారం రాత్రి ఆకతాయిల ఆటకట్టించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాత్రి ఒంటిగంట వరకు జరిగిన తనిఖీలలో 28 మంది ఆకతాయిలు, మందుబాబులను పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎల్లమ్మబండ ప్రాంతంలోని ప్రగతి నగర్ చెరువు, గాజులరామారం, జగద్గిరిగుట్ట, మహదేవపురం ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిర్మానుష ప్రాంతాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేస్తామని జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ హెచ్చరించారు. ఈ తనిఖీలను బాలానగర్ ఏసీపీ జి.హనుమంతురావు పర్యవేక్షించారు.

### నిజాంపేట్ పరిధిలో



కాలనీల్లో పర్యటిస్తున్న పోలీసులు

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. నేరాలను అరికట్టడమే లక్ష్యంగా తనిఖీలను నిర్వహిస్తున్నామని, బహిరంగ ప్రదేశాల్లో మద్యాన్ని సేవించవద్దని ఇన్‌స్పెక్టర్లు ఉపేందర్, యాదయ్యలు అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో సబ్ ఇన్‌స్పెక్టర్లు, షీటీం, ఏఆర్ ఫోర్స్ 20 మంది సిబ్బంది పాల్గొని 27మందిపై కేసులను నమోదు చేసినట్లు తెలిపారు.



పైపు నుంచి గ్యాస్ లీకవుతున్న దృశ్యం

## పైపులైను నుంచి గ్యాస్ లీక్

- భయాందోళనలో స్థానికులు



మరమ్మతులు చేస్తున్న గ్యాస్ సిబ్బంది

**షాపూర్‌నగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):** మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి ఎదురుగా ఉన్న యాజీడీ గ్యాస్ పైపులైను నుంచి శనివారం ఉదయం గ్యాస్ లీకవడంతో గుర్తించిన స్థానికులు భయాందోళనకు గురై సూరారం పోలీసులకు తెలియజేశారు. వారు విషయాన్ని గ్యాస్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌కు పోలీసులు సమాచారమివ్వగా వారు సంఘటనా స్థలానికి చేరుకొని లీకేజీకి గల కారణం, దీని ప్రభావాన్ని పరిశీలించారు. సమస్య చిన్నదే కావడంతో తక్షణమే మరమ్మతులు చేయించారు. ప్రజలు భయాందోళనకు గురి కావద్దని ప్రకటించారు. స్థానికంగా గ్యాస్ లీకేజీ వార్త దావాలనంగా వ్యాపించడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

## మంటలు అంటుకొని ఇద్దరు మైనర్లకు గాయాలు

- ప్రమాద స్థలంలో పెట్రోలు ఉండటంపై పలు అనుమానాలు

**పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి.):** ప్రమాదవశాత్తు పెట్రోల్‌పై నిప్పుపడి ఇద్దరు మైనర్ బాలికలు గాయాలపాలైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌లోని కృష్ణానగర్‌లో నివసిస్తున్న బీహార్‌కు చెందిన జంగ్ బహదూర్‌కు ఇద్దరు కుమార్తెలు. గుల్షన్(11), అఫ్షన్(10) శనివారం అదే ప్రాంతానికి చెందిన తమ స్నేహితుడు సాహెన్(11)తో కలిసి సమీపంలో పార్కు వద్ద ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో సాహెన్ తన వద్ద ఉన్న అగ్గిపెట్టెతో నిప్పంటించగా, ఆ ప్రాంతంలో అప్పటికే పెట్రోల్ పడి ఉండటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు బాలికలకు మంటలు అంటుకుని తీవ్ర గాయాలు కాగా స్థానికులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. కాగా ఇద్దరు బాలికలకు 30 శాతం మేర గాయాలైనట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురు మైనర్లే కావడంతో వాళ్లు ఆడుకుంటున్న ప్రదేశంలోకి పెట్రోల్ ఎలా వచ్చింది, ఆ బాలుడు తన వెంట అగ్గిపెట్టె ఎందుకు తెచ్చుకున్నాడు అనే అంశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటన స్థలంలో ముగ్గురు ఉండగా, కేవలం ఇద్దరు బాలికలకు మాత్రమే గాయాలవడం ప్రశ్నార్థకంగా మారింది. జరిగిన ఘటనపై మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. పోలీసు విచారణ పూర్తయితేనే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు అంటున్నారు.

# ఆందోళన బాట పట్టిన రైతులు

- పనులను అడ్డుకున్న రైతులు
- న్యాయం జరిగే వరకు పోరాడతాం : మల్లారెడ్డి



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద పనులను చేయవద్దని ఆందోళనకు దిగిన రైతులు

**దుండిగల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) :** దుండిగల్ గ్రామంలో పది రోజుల క్రితం ఆర్టీఏ కార్యాలయాల కోసం సర్వే నంబరు 453, 454ల్లో 40 ఎకరాలు కేటాయించిన విషయం రైతుల్లో పెద్ద దుమారం రేగుతోంది. ఈ కథనాన్ని 18న 'న్యాయం జరిగేలా చూడాలి' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఆ భూములు ఇప్పటివరకు తమ ఆధీనంలో ఉన్నాయని రైతులు అన్నారు. జిల్లా, మండల, రాష్ట్రస్థాయి కాంగ్రెస్, బీజేపీ నాయకులను కలిసి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఏళ్ల తరబడి తాము భూములను నమ్ముకొని జీవిస్తున్నామని, అలాంటిది కనీస సమాచారం, నోటీసులు ఇవ్వకుండా పలు శాఖలకు భూములను కేటాయించడంపై రైతులు ఆందోళన బాట పట్టారు. తమకు నష్ట పరిహారం చెల్లించాలి, లేదంటే భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం ఇది ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది కాబట్టి, ఏ నిర్ణయమైనా ప్రభుత్వం నుంచి రావాలని తేల్చి చెబుతున్నారు.

### రైతుల సమావేశం ముగియగానే మొదలైన పనులు

గ్రామంలో రైతులు సమావేశమై బీజేపీ నాయకులతో కలిసి ఆర్టీఏకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి వెనుదిరిగారు. ఇది జరిగిన గంట వ్యవధిలో ఆర్టీఏ అధికారుల ఆదేశాలంటూ కొంతమంది సిబ్బంది పనులు చేయించేందుకు శ్రీకారం చుట్టారు. విషయం తెలుసుకున్న రైతులు పలు పార్టీల నాయకులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. మాకు న్యాయం జరగకుండా పనులు మొదలు పెట్టడటం ఏమిటని నిలదీశారు. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకొని, పరిస్థితి చేయి దాటిపోకుండా స్థానిక నాయకులు, రైతులతో మాట్లాడి పనులను తాత్కాలికంగా నిలిపి వేయించారు.

### బీజేపీ మీవెంటే..

శనివారం దుండిగల్ గ్రామ వార్డు కార్యాలయంలో రైతులు, మాజీ కౌన్సిలర్లతో కలిసి మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ మీ వెంట ఉండి పోరాడుతుందని తెలిపారు. దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూమిలో 222కి పైగా రైతు కుటుంబాలు 70 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు పలు శాఖలకు కేటాయించిన భూమిపై పునరాలోచన చేసి, రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుండిగల్ విఘ్నేశ్వర్, దుండిగల్ బీజేపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, జక్కుల కృష్ణ యాదవ్, మాజీ కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, ఆనంద్ కుమార్, ఆకుల మల్లేష్ విజయ్‌సాయి, గ్రామ రైతులు ఉన్నారు.

## ముగిసిన సాంకేతిక ఉత్సవం



సాంకేతిక ఉత్సవంలో విద్యార్థులు ప్రదర్శించి సోలార్‌తో నడిచే వాహనం



మాట్లాడుతున్న పెద్దిరెడ్డిగారి బాలాప్రసాద్

**నిజాంపేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) :** సాంకేతిక అభివృద్ధి వేగంగా రూపాంతరం చెందుతున్న కాలంలో విద్యాసంస్థలు విద్యార్థులను, అధ్యాపకులను కూడా ఈ మార్పులను అందుకునేలా సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందని టీసీఎస్ సంస్థ ప్రధాన కన్సల్టెంట్ డిజిటల్ ఉప క్రమణాల అధిపతి పెద్దిరెడ్డి బాలప్రసాద్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని వీఎన్ఆర్‌వీజేఐటీలో రెండు రోజుల పాటు జరిగిన సాంకేతిక ఉత్సవం శనివారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాలప్రసాద్ మాట్లాడుతూ కన్వర్జెన్స్ వేడుకను పేరుకు తగినట్టుగా వివిధ సాంకేతికల కలియకకు వేదికగా 25 ఏళ్లకు పైగా నిర్వహిస్తున్నందుకు కళాశాల యాజమాన్యాన్ని, విద్యార్థులను అభినందించారు. ఈ ముగింపు వేడుకల్లో డీన్ ఆచార్య డాక్టర్ వై. పద్మశాయి, అధ్యాపకులు ఆచార్య డాక్టర్ సీడీ నాయుడు, సంచాలకులు చెన్నకేశరావు పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లో కళాశాల విద్యార్థి కూటమిలు పాల్గొని క్రెసెండో, లైవ్‌వైర్ సంగీత, నృత్య ప్రదర్శనలతో అలరించారు.

## రహదారిపై సంత.. వాహనదారుల చింత



రహదారిపై ట్రాఫిక్ జామ్

**పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) :** కుత్బుల్లాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో ప్రతి ఆదివారం నిర్వహించే సంతతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న కాలనీలకు వెళ్లాలంటే వీలు లేకుండా ఉంటుంది. రోడ్డుకు ఇరువైపులా బండ్లను ఏర్పాటు చేసి వ్యాపారం నిర్వహిస్తుండటంతో గంటల తరబడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

## మైనర్లకు సిగరెట్లు అమ్ముతున్న వారిపై కేసు

**బంజారాహిల్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):** మైనర్లకు సిగరెట్లు అమ్ముతున్న ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదైంది. వెంకటగిరిలో కిరాణాషాపులు, పాన్ షాపుల్లో మైనర్లకు సిగరెట్లు అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో జూబ్లీహిల్స్ ఎస్ఐ రమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. గంధం పరిమళ అనే కిరాణాషాపు నిర్వాహకురాలు మైనర్లకు సిగరెట్లు అమ్మినట్టు తేలడంతో కేసు నమోదు చేసి ఆరు వేల రూపాయల విలువ చేసే 88 సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కె.వెంకటేశ్వరరావు అనే కిరాణాషాపు యజమాని ఓ విద్యార్థికి సిగరెట్లు అమ్ముతుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి మూడు వేల రూపాయల విలువ చేసే సిగరెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

## ప్రేమలో విఫలమై యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**హైదర్‌నగర్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి):** ప్రేమించిన యువతికి పెళ్లి సంబంధాలు చూస్తుండటంతో మనస్థాపం చెందిన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా సునకేసుల కొత్తకోటకు చెందిన బీరప్ప కుమారుడు మల్లికార్జున (26) కర్నూల్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. అక్కడే స్థానికంగా ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. యువతి తల్లిదండ్రులు వీరి ప్రేమను ఒప్పుకోకపోగా ఆ యువతికి పెళ్లి చేసేందుకు సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. దీంతో మనస్థాపం చెందిన మల్లికార్జున్ నాలుగు రోజుల క్రితం తల్లిదండ్రులకు చెప్పకుండా హైదరాబాద్‌కు వచ్చాడు. ఉద్యోగం నిమిత్తం ఎక్కడికైనా వెళ్లాడేమోనని తల్లిదండ్రులు అనుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం ప్రగతినగర్ రోడ్డులోని అంబీర్‌చెరువు కట్టపైన ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఉన్న మల్లికార్జున మృతదేహాన్ని చూసిన స్థానికులు కేపీహెచ్‌బీ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడ లభించిన సెల్‌ఫోన్, పర్స్ ఆధారంగా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

## కమ్యూనిజం అజేయంగా ఉంటుంది

**షాపూర్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):** దోపిడి, ఆర్థిక అసమానతలు ఉన్నంత కాలం కమ్యూనిజం అజేయంగా ఉంటుందని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. రెడ్‌బుక్ డే సందర్భంగా షాపూర్ నగర్ పార్టీ కార్యాలయంలో పార్టీ 24వ జాతీయ మహాసభ రాజకీయ తీర్మానం ముసాయిదాను పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్‌ను మార్చేది, అసమానతలు లేని సమాజం కమ్యూనిస్టు ప్రభుత్వంలో మాత్రమే ఉంటుందని, పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై గర్జించేది కమ్యూనిస్టులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు దేవదానం, మల్లారెడ్డి అంజనేయులు, శ్రీను, యాదవరెడ్డి, చిన్నప్ప, సునీల్ పాల్గొన్నారు.

# ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి తోడ్పడండి: ఉప కమిషనర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి

**చందానగర్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి):** వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్స్‌లను ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ పి.మోహన్‌రెడ్డి అన్నారు. సర్కిల్ కార్యాలయంలో వ్యాపార లైసెన్స్‌పై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వ్యాపారులు ప్రొవిజనల్ ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్ చెల్లింపు ద్వారా పొందవచ్చన్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా రెన్యువల్ చేసుకోవాలని ఆయన సూచించారు. లేకుంటే వారు జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. రహదారి, కొలతల ఆధారంగా ఫీజులు నిర్ణయిస్తారని తెలిపారు. ఆహార కల్తీ నివారణ కోసం హోటళ్లపై తనిఖీలు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఏఎంహెచ్ఓ రవి, అసిస్టెంట్ లైసెన్స్ అధికారి నరేందర్, కృష్ణ ఉన్నారు.

### ఎన్నో సమస్యలకు 'ప్రాపర్టీ షో పరిష్కారం'

ఆస్తిపన్ను సమస్యలు, పునర్ సమీక్ష, అభ్యర్థనలు, ఆస్తిపన్ను అంచనాల్లో సవరణలు, అసైన్ బకాయిలు తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రాపర్టీషో పరిష్కార వేదికలు ఎంతో ఉపయోగపడుతాయని చందానగర్ సర్కిల్-21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి అన్నారు. చందానగర్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ప్రాపర్టీషో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్తిపన్నుకు సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారం, ఐజీఆర్ఎస్, స్వయం మూల్యాంకణం, పన్ను సర్దుబాటు, సవరణలు, బిల్లు కలెక్టర్ల ద్వారా చెల్లింపు నమూనా తదితర సమస్యలను తొలగించుకునేందుకు ఇది చక్కటి అవకాశం దీనిని ప్రజలు ఉపయోగించుకుని లబ్ధిపొందాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మార్చి నెలలో 1,8,15,22,29 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఉషోదయ కాలనీలో ప్రధాన రోడ్డుపై వెలిసిన డబ్బాలు

## అక్రమంగా వెలసిన డబ్బాలను తొలగించాలి

**గాజులరామారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) :** ప్రజల సౌకర్యార్థం రోడ్డు పక్కన నిర్మించిన ఫుట్‌పాత్‌లు చిరు వ్యాపారులకు అడ్డాగా మారింది. గాజులరామారం డివిజన్‌లోని ఉషోదయ కాలనీ ఫేజ్-1 నుంచి చంద్రగిరి నగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లను చిరు వ్యాపారులు ఆక్రమించి వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. గతంలో ఇక్కడ వెలిసిన డబ్బాలను జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. కానీ తొలగించిన వారం రోజులకే మరలా అదే స్థలంలో కొత్త డబ్బాలు, తోపుడు బండ్లు వెలిశాయి. దీనికి తోడు ద్విచక్ర వాహనదారులు రోడ్డు పైనే వాహనాలను నిలిపి వెళుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని కాలనీ వాసులు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌పై వెలిసిన అక్రమ డబ్బాలను తొలగించి, పాదాచారులు రాకపోకలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.